# భారత్... మానవాభివృద్ధి నివేదిక-2008

**మానవాభివృద్ధి నివేదిక -2008 ప్రకారం.. మానవాభివృద్ధి సూచీలో భారతదేశ స్థానం.. 128 నుంచి 132కు దిగజారింది. ఇది మానవాభివృద్ధిలో మన వెనుకబాటును సూచిస్తోంది. మానవ మూలధన వృద్ధి.. ఆదాయవృద్ధికి దారితీస్తుంది. అందువల్ల భారత్ వంటి అభివృద్ధి చెందుతోన్న దేశాలు.. మానవ మూలధనం చేసే పెట్టుబడులను 'ఆర్థిక వృద్ధికి ఇంజన్' (Engine of Growth)గా పరిగణించాలి. ప్రభుత్వ విధానాలు, పన్నులు, సబ్సిడీలు, సంస్కరణలు.. ప్రత్యక్షంగా, పరోక్షంగా పెట్టుబడులను ప్రోత్సహిస్తాయి. కేంద్ర ప్రభుత్వం పదకొండో పంచవర్ష ప్రణాళికను 'విద్యా ప్రణాళిక' గా ప్రకటించింది. ఇది మానవాభివృద్ధి మెరుగుదలకు ప్రభుత్వకృత నిశ్చయాన్ని సూచిస్తోంది!!**

ఆర్థికాభివృద్ధిలో మానవ వనరుల అభివృద్ధి ప్రాధాన్యతను అనేక అధ్యయనాలు సూచిస్తున్నాయి. వేగవంతమైన ఆర్థిక ప్రగతిని సాధించాలంటే... శ్రామిక ఉత్పాదకతలో పెరుగుదల, భౌతిక పెట్టుబడులు పెరగాలి. గతంలో మానవ మూల ధనాన్ని ఆర్థికవృద్ధిలో ఒక ఉత్పత్తి కారకంగా గుర్తించడాన్ని విస్మరించడం జరిగింది. స్థూల ఆర్థిక చలాంకాలైన.. ఉత్పాదకత, తలసరి ఆదాయం, వృద్ధిరేటుకు సంబంధించి.. దేశాల మధ్య తేడాలు పరిశీలించడానికి... మానవ మూలధన రాశి, విద్యపై పెట్టుబడి అనే రెండు కారకాలు ఉపయోగపడ్డాయన్నది నిపుణుల అభిప్రాయం! మానవ మూలధనరాశి ఒక ఉత్పాదక కారకమని సంప్రదాయ నమూనాలు అభిప్రాయపడినట్లు తెలుస్తోంది.

## మానవాభివృద్ధి, ఆర్థికవృద్ధి... ఆర్థికవేత్తలు:

శ్రామిక శక్తి ఉత్పాదక సామర్థ్యాన్ని, నేర్పరితనాన్ని పెంచడం ద్వారా... విద్య జాతీయాదాయ వృద్ధికి ప్రత్యక్షంగా దోహదపడు తుందని షుల్జ్ (Schultz) పేర్కొన్నారు. Gianaries అభిప్రాయం ప్రకారం-విద్య, శిక్షణ, ఆరోగ్యంపై చేసే మూలధన వ్యయం.. ఆర్థికాభివద్ధిపై ధనాత్మక ప్రభావం చూపుతుంది. ఉత్పత్తి స్థాయి పెంపునకు సహజ వనరులు, మూలధన వనరుల లభ్యత అవసరం. వీటిని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలంటే... మానవ వనరుల నాణ్యత పెరగాల్సిన అవసర ముందని హార్బిసన్ (Harbison) నొక్కిచెప్పారు. విద్యతోపాటు మానవ మూలధనంపై చేసే ఇతర పెట్టుబడులు.. ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతూ.. పేద ప్రజల ఆదాయ పెరుగుదలకు.. రవాణా, సమాచారం, విద్యుత్, నీటిపారుదల రంగాల అభివృద్ధికి దోహదపడతాయని ఉడ్‌హాల్ (wood hall) అభిప్రాయపడ్డారు. విద్యారంగంపై పెట్టుబడులు.. మరణాల రేటు, పిల్లల్లో పౌష్టికాహార లోపాన్ని తొలగించడానికే కాకుండా.. ఆయుఃప్రమాణ పెరుగుదల, దీర్ఘకాలంలో సంతానోత్పత్తి తగ్గుదలకు దోహదపడతాయని హాన్సన్ (Hanson) పేర్కొన్నారు.

సంతానోత్పత్తిని ప్రభావితం చేయడంలో పురుషుల్లో విద్య కంటే.. మహిళల్లో విద్య దోహదపడుతుంది. విద్యారంగ పెట్టుబడుల వల్ల కలిగే ప్రయోజనాలను కొలవడంలో.. విద్యావంతులైన శ్రామికుల అధిక శ్రామిక మార్కెట్ రాబడులే కాకుండా.. మహిళల శ్రామికేతర మార్కెట్ కార్యకలాపాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సచారో పౌలస్ అభిప్రాయపడ్డారు. అల్పాభివృద్ధి దేశాల్లో వృద్ధికి విద్య ఎంతో దోహదపడిందన్నది రాబిన్ సన్ భావన.

### హెచ్‌డీఐ సూచీ విలువ:

మానవాభివృద్ధి సూచీని రూపొందించడానికి పరిగణనలోకి తీసుకున్న 179 దేశాలను.. అవి సాధించిన మానవాభివృద్ధి స్థాయిని బట్టి మూడు రకాలుగా వర్గీకరించారు. అవి.. మానవాభివృద్ధి సూచీ విలువ(హెచ్‌డీఐ) 0.800, లేదా అంతకంటే ఎక్కువ ఉన్న దేశాలు.. అధిక మానవాభివృద్ధి సాధించిన దేశాలు. హెచ్‌డీఐ విలువ 0.500 నుంచి 0.799 మధ్య కలిగిన దేశాలు.. మధ్యస్థ మానవాభివృద్ధి దేశాలు. అదేవిధంగా హెచ్‌డీఐ విలువ 0.500 కంటే తక్కువ ఉన్న దేశాలు.. అల్ప మానవాభివృద్ధి సాధించిన దేశాలు. హెచ్‌డీఐ నివేదిక ప్రకారం- 75 దేశాలు అధిక మానవాభివృద్ధి సాధించిన దేశాలు. కాగా, 78 దేశాలు మధ్యస్థ మానవాభివృద్ధి దేశాలు. మిగతా 26 దేశాలు.. అల్ప మానవాభివృద్ధి పొందిన దేశాలు.

### ప్రపంచ బ్యాంకు వర్గీకరణ:

ప్రపంచ బ్యాంకు ఆయా దేశాల ఆదాయాలను బట్టి... అధిక, మధ్య, అల్ప ఆదాయ దేశాలుగా వర్గీకరించింది. దీని ప్రకారం- 2006లో 905 అమెరికన్ డాలర్లు లేదా అంతకంటే తక్కువ తలసరి ఆదాయమున్న దేశాలు.. అల్పాదాయ దేశాలు. 906 నుంచి 11,115 డాలర్ల మధ్య తలసరి ఆదాయం ఉన్న దేశాలను మధ్య ఆదాయ దేశాలు. 11,116 డాలర్లు, అంతకంటే ఎక్కువ తలసరి ఆదాయమున్న దేశాలు అధిక ఆదాయ దేశాలు. మొత్తం దేశాలను అభివృద్ధి చెందుతున్న దేశాలు, మధ్య, తూర్పు ఐరోపా, కామన్‌వెల్త్ ఆఫ్ ఇండిపెండెంట్ స్టేట్స్, ఆర్గనైజేషన్ ఆఫ్ ఎకనామిక్ కో ఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్ (OECD)గా నివేదిక వర్గీకరించింది. అభివృద్ధి చెందుతున్న దేశాలను అరబ్ స్టేట్స్, తూర్పు ఆసియా, పసిఫిక్, లాటిన్ అమెరికా, కరేబియన్ (మెక్సికోతో కలిపి), దక్షిణ ఆసియా, దక్షిణ ఐరోపా, సబ్ సహారా ఆఫ్రికా దేశాలుగా వర్గీకరించారు. మానవాభివద్ధి నివేదిక- 2008 ప్రకారం... 2006లో మానవాభివద్ధి సూచీలో ఐస్‌లాండ్, నార్వేలకు వరుసగా ప్రథమ, ద్వితీయ స్థానాలు లభించాయి. భారత్‌కు 132వ స్థానం లభించగా... సియారాలియాన్ చిట్టచివర స్థానాన్ని పొందింది.

### మానవాభివృద్ధి సూచీ:

మానవాభివృద్ధి సూచీ రూపొందించడానికి తలసరి ఆదాయం (PPP), స్థూల ఉమ్మడి నమోదు నిష్పత్తి, ఆయుఃప్రమాణంలను పరిగణనలోకి తీసుకుంటారు. ఈ మూడు సూచికల విషయంలో మన దేశ పరిస్థితి

సంతృప్తికరంగా లేదు. దాంతో మానవాభివృద్ధి సూచీ రూపొందించిన 179 దేశాల్లో మనకు 132వ స్థానం లభించింది. మన దేశంలో ఆయుఃప్రమాణం 2006లో 64.1 ఏళ్లు. అదేవిధంగా స్థూల ఉమ్మడి నమోదు నిష్పత్తి 61 శాతంగా, తలసరి ఆదాయం (PPP) 2,489 డాలర్లుగా ఉంది.

## మానవ పేదరిక సూచీ-1:

మానవ పేదరిక సూచీ-1ని అభివృద్ధి చెందుతున్న దేశాలకు సంబంధించి రూపొందిస్తారు. 40 ఏళ్ల వరకు జీవించని (survive) ప్రజల శాతం.. వయోజన నిరక్షరాస్యత రేటు.. పరిశుభ్రమైన నీరు లభించని ప్రజల శాతం.. సరైన బరువు లేకుండా జన్మించిన శిశువుల శాతం.. జాతీయ దారిద్ర్యరేఖ.. వంటి సూచికల ఆధారంగా ఈ సూచీ రూపొందిస్తారు. 135 దేశాలకు సంబంధించి ఈ సూచీని రూపొందించారు. మానవ పేదరిక సూచీ-1 ప్రకారం... చెక్ రిపబ్లిక్ మొదటి స్థానాన్ని.. భారత్ 87వ స్థానాన్ని.. అఫ్గానిస్థాన్ చిట్టచివరి 135వ స్థానాన్ని పొందాయి. 40 ఏళ్ల వరకు survive కాని ప్రజల శాతం మన దేశంలో 16.8 శాతం. కాగా, వయోజన నిరక్షరాస్యత 34.8 శాతం. పరిశుభ్రమైన నీరు లభించని ప్రజల 11 శాతం. సరైన బరువు లేకుండా జన్మించిన శిశువులు 46 శాతం. జాతీయ దారిద్ర్య రేఖ 28.6 శాతం.

## లింగ సంబంధిత అభివృద్ధి సూచీ:

మానవాభివృద్ధి సూచీ తయారీలో వినియోగించే మూడు సూచికలను పరిగణనలోకి తీసుకొని లింగ సంబంధిత అభివృద్ధి సూచీ రూపొందిస్తారు. తద్వారా స్త్రీ, పురుషుల మధ్య అసమానతలను కొలుస్తారు. లింగ సంబంధిత అభివృద్ధి సూచీని మొత్తం 157 దేశాలకు రూపొందించారు. ఐస్‌లాండ్‌కు మొదటి స్థానం, భారత్‌కు 116వ స్థానం, సియారాలియాన్‌కు 157వ స్థానం లభించింది. ఈ నివేదిక ప్రకారం- 2006లో భారత్‌లో Estimated Earned Income (అంచనా వేసిన ఆదాయం) స్త్రీలకు 1185 డాలర్లు. కాగా, పురుషులకు 3698 డాలర్లు. స్థూల ఉమ్మడి నమోదు నిష్పత్తి స్త్రీలలో 57.4 శాతం, పురుషుల్లో 64.3 శాతం. ఆయుఃప్రమాణం స్త్రీలలో 65.7 ఏళ్లు. కాగా, పురుషుల్లో 62.7 ఏళ్లు.

## లింగ సాధికారత సూచీ:

లింగ సాధికారత సూచీ 108 దేశాలకు రూపొందించారు. దీనిలో స్వీడన్ మొదటి స్థానాన్ని.. యెమెన్ 108వ స్థానాన్ని పొందాయి. సరైన సమాచారం లేకపోవడంతో.. భారత్‌కు సంబంధించి ఈ సూచీని రూపొందించలేదు. పార్లమెంటులో మహిళా సభ్యులు, మహిళా శాసన సభ్యులు, సీనియర్ మహిళా అధికారులు, మేనేజర్లు, మహిళా టెక్నికల్ వర్కర్స్ సూచికల ఆధారంగా ఈ సూచీని రూపొందిస్తారు.

## వివిధ సూచీలు–వివిధ దేశాల ప్రగతి:

| దేశాలు | మానవాభివృద్ధి సూచీ 2006 | | మానవ పేదరిక సూచీ -1 (2006) | | లింగ ఆధారిత అభివృద్ధి సూచీ (2006) | |
|---|---|---|---|---|---|---|
| | ర్యాంకు | విలువ | ర్యాంకు | విలువ | ర్యాంకు | విలువ |
| ఐస్‌లాండ్ | 1 | 0.968 | – | – | 1 | 0.963 |
| అమెరికా | 15 | 0.950 | – | – | 19 | 0.937 |
| చైనా | 94 | 0.762 | 35 | 7.9 | 79 | 0.760 |
| ఫిలిప్పైన్ | 102 | 0.745 | 54 | 12.5 | 86 | 0.743 |
| శ్రీలంక | 104 | 0.742 | 67 | 16.9 | 90 | 0.735 |
| ఇండియా | 132 | 0.609 | 87 | 28.5 | 116 | 0.591 |
| పాకిస్థాన్ | 139 | 0.562 | 100 | 33.6 | 121 | 0.537 |
| కెన్యా | 144 | 0.532 | 91 | 31.4 | 123 | 0.531 |
| ఇథియోపియా | 169 | 0.389 | 130 | 51.6 | 148 | 0.377 |
| సియారాలియాన్ | 179 | 0.329 | 129 | 51.2 | 157 | 0.311 |

ఆధారం: మానవాభివృద్ధి నివేదిక – UNDP – 2008